క్లుప్తంగా

రెండు రోజులపాటు నీటి సరఫరాలో అంతరాయం

పెనగలూరు : మండల పరిధిలోని 24 గ్రామాలకు చెయ్యేరు తాగునీటి సరఫరాలో మరో రెండు రోజులు అంతరాయం ఉంటుందని కాంట్రాక్టర్ గోపిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణలు తెలిపారు. గతంలో వరదలు రావడంతో చెయ్యేటికి దగ్గరలో ఫిల్టర్ పాయింట్ వేసి తాగునీటిని అందిస్తున్నారు. అయితే చెయ్యేరు నదిలో నీరు తగ్గి మోటార్లకు నీరు అందకపోవడంతో దూర ప్రాంతంలో ఫిల్టర్ పాయింట్ వేసి తాగునీరు అందించనున్నట్లు వారు తెలిపారు. అలాగే నదిలో ఉన్న బావిలో పూడిక తీసి రెండు మోటర్లను అమర్చి తాగునీరు అందించనున్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి గడప గడపకు కార్యక్రమం

సంబేపల్లి : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శెట్టిపల్లె గ్రామంలో నేటి నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 6 గంటలకు శెట్టిపల్లె పంచాయతీ కడియాళవాండ్లపల్లె నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, సిబ్బంది హాజరుకావాలన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని దిగువ సిద్దవరం గ్రామంలో శనివారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు. కల్యాణాన్ని సిద్దవరం సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలత, కాకతీయ వెంకటేశ్వరరెడ్డిల సహకారంతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు మధ్య చేశారు. ఆలయానికి నూతనంగా విగ్రహాలు తేవడంతో గ్రామస్తులు కల్యాణం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం కడపలోని సిద్దార్థ పాఠశాల అధినేత లక్ష్మయ్య దంపతులు అన్నదానం నిర్వహించగా రాత్రి పొమ్మల గంగాద్రి, సునీత దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి పంద్ర భజన ఆకట్టుకుంది. ఆదివారం తెల్లవారుజామున ఊరేగింపు వసంతోత్సవం నిర్వహించనున్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు


గాలంగుండ్లపల్లెలో పనులను పరిశీలిస్తున్న నాయకులు

రామాపురం : మండల పరిధిలోని కల్పనచెరువు గ్రామం గాలంగుండ్లపల్లెలో సీసీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. నియోజకవర్గ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి గ్రామంలో పర్యటించినప్పుడు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకు రావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు వేగవంతంగా నాణ్యతగా చేయాలంటూ గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, మండల వైస్ ఎంపీపీ బాబులు గుత్తేదారులకు తెలియజేశారు. సంవత్సరాలుగా గాలంగుండ్లపల్లెకు రోడ్డు లేక ఇబ్బంది పడిన గ్రామస్తులు నేటితో ఇబ్బందులు తొలగిపోనున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలను తెలియజేశారు.

శిల్పారామానికి రంజాన్ శోభ


శిల్పారామంలో నృత్యం చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : కడప శిల్పారామం శనివారం చిన్నారుల నృత్య గీతాలతో కొత్త శోభను సంతరించుకుంది. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమంగా మిస్బా మూవీ పర్యవేక్షణలో ఎస్.కె., ఆర్.కె. డాన్స్ అకాడమీ తమ ప్రతిభను చాటుకునేందుకు పలు గీతాలకు ఉత్సాహంగా నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రక్తదానం

వైవీయూ : ప్రాణం విలువ తెలిసిన 16 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరం ఆర్‌టీసీ బస్టాండు సమీపంలో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన వారోత్సవాల్లో భాగంగా 2వ రోజు శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వర్ణలత, శాంతి అనే ఇద్దరు మహిళలు సైతం రక్తదానం చేయడం విశేషం. కార్యక్రమంలో బ్లడ్ టు లివ్ సంస్థ ప్రతినిధులు తోట కల్యాణ్, పల్లా జయకృష్ణ, తోట మోహన్‌సాయి, రిమ్స్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రస్సెల్, జయచంద్రారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు

- రాయచోటిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- రాజంపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి
- ప్రతి రోజూ అల్లాహ్‌ను స్మరించుకోవాలంటూ సందేశమిచ్చిన ఈమామ్‌లు


రాయచోటి టౌన్: ఈద్గా వద్ద ముస్లింలతో ఎంపీ పి.వి. మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు


రాజంపేట టౌన్: ప్రార్థనల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్


సిద్దవటం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


చిన్నమండెం: సామూహిక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


గాలివీడు: రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు


రాజంపేట: నాగిరెడ్డిపల్లె అర్బన్‌లోని జామీయా మసీదులో

రాయచోటి టౌన్ : రంజాన్ మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలు ముగిశాయి. చివరి రోజైన శనివారం ఈద్ – ఉల్ – ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. రాయచోటి పట్టణంలోని ప్రధాన ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్ద సర్కాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు పూర్తయిన తరువాత మత పెద్ద సందేశం ఇచ్చారు. మన దైనందిక కార్యక్రమాలలో ప్రతి రోజూ అల్లాహ్‌ను స్మరించుకోవాలని ప్రతి రోజు నమాజ్ చేయాలని సూచించారు. రంజాన్ మాసంలో నిర్వహించినట్లుగానే ప్రతి రోజూ నమాజ్ చేయాలన్నారు. అనంతరం ప్రతి ఒక్కరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాలు పెంపొందించుకోవాలి – ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

పాత రాయచోటి ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే జి. శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు. నమాజ్ పూర్తయిన ముస్లింలను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకంగా రాయచోటి నిలుస్తోందని వారు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లీం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని చెప్పారు. అల్లాహ్ దయ వలన ప్రతి ఒక్కరూ ఆయురోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కాగా ప్రార్థనల్లో ముస్లింలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ ప్రార్థనల్లో ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో రంజాన్ సందడి కనిపించింది. పట్టణంలోని పెద్ద ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఆకేపాటి ముస్లింలను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలంలోని పాటూరు, నాగిరెడ్డిపల్లె, అరవపల్లె, నందలూరు, ఆడపూరు, టంగుటూరు గ్రామాల్లో ముస్లీంలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలలో ప్రార్థనలు నిర్వహించారు. నందలూరు ఈద్గాలో ప్రభుత్వగెజిటెడ్ ఖాజీ మోహిసీద్దిన్ హుసేనీ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.

రామాపురంలో..

రామాపురం : పవిత్రమైన రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఉపవాసాలు తరువాత శనివారం ఈద్ జరుపుకుంటున్న ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలను లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి తెలియజేశారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు చెప్పిన సందేశాన్ని ఆలకించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని చిన్నమండెం, చాకిబండ, మల్లూరు, వండాడి, బోనమల, కేశాపురం, పడమటికోన గ్రామాల్లోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని ముస్లింలు రంజాన్ వేడుకలను శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు చేసిన ఉపవాస దీక్షలను శనివారంతో ముగించారు. మండలంలోని మహబూబ్‌నగర్, ఆలీనగర్, భాకరాపేట, కనుమలోపల్లె, సిద్దవటం, ఉప్పరపల్లె, తురకపల్లె, ఖాదర్‌బంగ్లా తదితర గ్రామాలలో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిద్దవటం ఈద్గా వద్ద ఇమాం పీర్‌బాషా ఖాద్రి మహ్మద్ ప్రవక్త సందేశాన్ని వినిపించారు. రంజాన్ మాసంలో ఏవిధంగా పుణ్యకార్యాలు, దైవచింతనతో గడిపారో మిగిలిన రోజుల్లో కూడా అదేమార్గంలో నడవాలన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో ఉన్న ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్నానాలు ఆచరించి కొత్త బట్టలు ధరించి సమీప ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు చెప్పిన బోధనలను విన్నారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

రైల్వేకోడూరు : మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని, ఈ పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మైసూరువారిపల్లెలో పంచాయతీలోని ఈద్గా మైదానంలో రంజాన్‌ను పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకంక్షలు తెలుపుతూ, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. అంతకుముందు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా ఘనంగా శనివారం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఓబులవారిపల్లె, నూకనపల్లె, చెన్నరాజుపోడు, వైకోట, సంజీవపురం, మంగంపేట, కొర్లకుంట, చిన్నఓరంపాడు, ముక్కవారిపల్లె ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చిట్వేలిలో..

చిట్వేలి : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం, ముస్లిం సోదరులు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం 8 గంటలకే ఈద్గాకు చేరుకొని ప్రార్థనలు చేసి పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు మౌలానా జౌహార్ ఆలి పండుగ విశిష్టతను వివరించారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను మండలంలోని లక్కిరెడ్డిపల్లి, కోనంపేట, రెడ్డివారిపల్లె, చింతలకుంటపల్లె, పందిళ్ళపల్లె, దిన్నెపాడు, పలు గ్రామాలలో మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం శనివారం రంజాన్‌ను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. రంజాన్ సందర్భంగా రెడ్డివారిపల్లి మార్గ మధ్యలో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రార్థనలో పాల్గొన్నారు. ప్రార్థనలకు వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా కుటుంబ సభ్యులంతా కొత్తబట్టలు ధరించి, భక్తి భావంతో ప్రార్థనలకు ఈద్గా వద్దకు తరలివచ్చారు.


చిట్వేలి: మండల కేంద్రంలో..


లక్కిరెడ్డిపల్లె: సందేశమిస్తున్న ఖాజీముక్తార్

ప్రభుత్వ ఖాజీ ముక్తార్ ఖురాన్ సూక్తులను వినిపించి, ప్రార్థనలు చేయించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

గాలివీడులో..

గాలివీడు : మండలంలో ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా నెలరోజులు ఉపవాసాలు ఉండి శనివారం రంజాన్ పండుగను ఈద్గాల వద్ద ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ముస్లిం పెద్దలు ఖురాన్ విశిష్టత, ఉపవాసాల ప్రాముఖ్యత, నమాజ్ గొప్పతనం గురించి వివరించారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : ప్రతి ఒక్కరూ అల్లాహ్‌ను విశ్వసించి సన్మార్గంలో నడవాలని ఒంటిమిట్టలో జరిగిన ప్రార్థనలో ఇమామ్ తెలిపారు. మండలంలో శనివారం ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలను తెలుపుకున్నారు.


రైల్వేకోడూరు: ప్రార్థనలో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల, ముస్లింలు


రామాపురం: శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి


సంబేపల్లె: రౌతుకుంట ఈద్గా వద్ద..


ఓబులవారిపల్లె: దైవ సందేశమిస్తున్న ఇమామ్

రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కేంద్రం కుట్రలు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకమిటీ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం, ప్రైవేటీకరించడం ద్వారా అమలులో ఉన్న రిజర్వేషన్‌లను ఎత్తివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఏపీ గిరిజన సమాఖ్య మూడవ రాష్ట్ర మహాసభల నిర్వహణకు ఆహ్వాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాలకులు అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చారన్నారు. గతంలో ఇచ్చిన హామీలను విస్మరించి బాక్సైట్ తవ్వకాలను అనుమతులివ్వడం దుర్మార్గమన్నారు. అటవీ సంపద కోసం గిరిజనుల సంస్కృతిని విధ్వంసం చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు.

రాయచోటిలో గిరిజన సమాఖ్య 3వ రాష్ట్రమహాసభలు

మే 28 నుంచి 31వ తేదీ వరకు రాయచోటిలో ఏపీ గిరిజన సమాఖ్య 3వ రాష్ట్రమహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలను పురస్కరించుకుని 10 వేల మంది గిరిజనులతో పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సినీనటులు నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, గోరేటి వెంకన్న తదితరులు హాజరవుతారన్నారు. మహాసభలకు జిల్లాలోని గిరిజనులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలంటూ ఆయన కోరారు. సమావేశంలో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, నాస్తిక సమాజం నేత పల్లం తాతయ్య, లంబాడా సంఘం నేతలు శంకర్ నాయక్, బంజారాసంఘం నేతలు నారాయణ నాయక్, సిపిఐ నేతలు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సుధీర్‌కుమార్, కోటేశ్వరరావు, సాంబశివ, క్రిష్ణప్ప, సుమిత్రమ్మ, జ్యోతి, రంగారెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ చండీహోమం

సిద్దవటం : బంగారుపేట గ్రామ శివారులో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం అమ్మవారికి వేద పండితులు నవగ్రహ చండీహోమం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యల ఆధ్వర్యంలో అమ్మవారికి గణపతి హోమం, రుద్రస్వాహాకార హోమం, లక్ష్మీ సహస్ర నామ హోమం, సర్వతోభద్ర మండల హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, కుంభజల ప్రోక్షణం, మంగళహారతి, మంత్రపుష్పం చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


నవగ్రహ చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

జీవ వైవిధ్యానికి పాటుపడాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రకృతిని ప్రేమిస్తూ జీవ వైవిధ్యానికి పాటుపడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ధరిత్రీ దినోత్సవం సందర్భంగా శనివారం డీఈఓ రాఘవరెడ్డి సేవ్ సోల్ అనే టీషర్టు లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థులకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ ఎక్కడో ఒక చోట ఒక మొక్కను నాటాలని కోరారు. మొక్కలను సంరక్షించడం కూడా బాధ్యతగా భావించాలన్నారు. సైన్సు ఉపాధ్యాయుల దృష్టికి ప్రతి కార్యక్రమాన్ని తీసుకొస్తూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్న జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డిని డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో కలిసి లోగోను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలసిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నిర్మాణాలు పూర్తయిన వారికి విద్యుత్ సౌకర్యం


జగనన్న కాలనీలో ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్

సిద్దవటం : జగనన్న కాలనీలో పక్కా గృహాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఈఓపీఆర్‌డీ బి. పులిరామ్‌సింగ్ తెలిపారు. మండల కేంద్రంలోని జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇళ్లు పూర్తయిన వారు వారికి విద్యుత్ సౌకర్యం కోసం ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మొబైల్ నెంబర్, ఇళ్ల మంజూరు పత్రాలు తీసుకొని సిద్దవటం గ్రామ సచివాలయంలో అందజేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని ఆయన అన్నారు.

శ్రీహరికోటకు ఆర్టీసీ సర్వీసులు

పీలేరు రూరల్ : శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ వీక్షణకు పీలేరు నాలుగు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను పంపించినట్లు డీఎం కుమార్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు బస్సులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. సీఐ ధనుంజయ, ప్రమీల, కల్లూరి వెంకటరమణ, యూనియన్ నాయకులున్నారు.

సైన్స్ పరీక్షను వేర్వేరుగా నిర్వహించండి

– ఆర్జేడీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేసిన సైన్స్ ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో సైన్స్ పరీక్షకు సంబంధించి జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం రెండు వేర్వేరుగా నిర్వహించాలని కడప పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) వెంకట కృష్ణారెడ్డికి అన్నమయ్య జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న 10 పరీక్షల స్పాట్ వాల్యూయేషన్ పరిశీలనకు వచ్చిన ఆర్జేడీని వారు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటిసారిగా సైన్స్ పరీక్ష రోజు భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం కలిసి పరీక్ష నిర్వహించారన్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు మార్ల ఓబుల్ రెడ్డి, భౌతిక రసాయన శాస్త్రం ఫోరం అధ్యక్షుడు భాస్కరన్, సీనియర్ ఉపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, రామలింగరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, సైన్స్ కన్వీనర్ రవీంద్రారెడ్డి, పల్లం రామచంద్ర, చంద్రశేఖర్, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డిని కలసి వినతి పత్రాన్ని అందజేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు

పండిట్, పీఈటీల పదోన్నతిలో..

తెలుగు, హిందీ పండిట్‌లతోపాటు పీఈటీ ఉపాధ్యాయుల అప్‌గ్రేడింగ్ (పదోన్నతులు) జిల్లాకు ఒక విధంగా ఉన్నాయని దీని వలన భవిష్యత్తులో తాము పొందే ప్రమోషన్లలో వ్యత్యాసాలు వస్తాయని ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు, హిందీ, పీఈటీ 100శాతం అప్ గ్రేండింగ్‌లో భాగంగా జోన్ – 4 కడప నాలుగు పాత జిల్లాలు, కొత్త 8 జిల్లాలలో తమ జాయినింగ్ ఒకొక్క జిల్లాకు ఒక్కో విధంగా ఉందన్నారు. దీనివలన తాము పొందే ప్రమోషన్లలలో వ్యత్యాసం వస్తుందని తెలియజేశారు.

కౌమార దశలో ఆరోగ్యంపై అవగాహన అవసరం

నందలూరు(రాజంపేట) : కౌమారదశలో ఆరోగ్యంపై అవగాహన చాల అవసరమని మండల వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, కౌమార ఆరోగ్య కౌన్సిలర్ రాజశేఖర్‌లు అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కౌమార బాలబాలికల ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌమార దశలో బాలబాలిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.


ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నలుగురు జూదరుల అరెస్ట్

కలకడ : పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6780 నగదు , పేక ముక్కలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సిటిస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం మండలంలోని గుడిబండ పంచాయతీలో పేకాట ఆడుతున్న శ్రీమన్నారాయణ, బాలాజి, మధుసూదన్, చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలో 20 లీటర్ల సారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. శనివారం ముందుగా అందిన సమాచారంతో మండలంలోని గూడరేవుపల్లె వాహనాలు తనిఖీ చేశారు. గూడరేవుపల్లెకు చెందిన బాలకృష్ణ సారా తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.